# కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే..


హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ


సమావేశానికి హాజరైన ఏడు మండలాల ముస్లింలు

- **కాంగ్రెస్ హయాంలో ముస్లింలకు ఒరిగిందేమీలేదు**
- **మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు ముస్లిం విద్యార్థుల భవితకు పునాదులు**
- **మంచి మనిషి వొడితెల సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం**
- **హోంమంత్రి మహమూద్ అలీ**

హుస్నాబాద్, నవంబర్ 23: కాంగ్రెస్ చెప్పే మాయమాటలు విని హస్తం గుర్తుకు ఓటేస్తే ముస్లిం మైనార్టీలకు కష్టాలు మళ్లీ మొదలవుతాయని హోంమంత్రి మహమూద్ అలీ వ్యాఖ్యానించారు. సర్వమత సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా ఉన్న సీఎం కేసీఆర్‌కు మద్దతు పలకాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ముస్లిం పిల్లలకు చదువుకునే అవకాశం లేక హోటళ్లలో పనిచేసేవారని, సీఎం కేసీఆర్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించి నాణ్యమైన విద్యను అందించడంతో ప్రస్తుతం 1.50లక్షల మంది ముస్లిం విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. కుల మతాలకు అతీతంగా అందరినీ గౌరవించే సతీశ్‌కుమార్‌కు మూడోసారి భారీ విజయం అందించాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌కు హ్యాట్రిక్ ఇద్దామన్నారు.

**మరోసారి ఆశీర్వదించండి**

నియోజకవర్గంలో ముస్లింల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు వారి అభివృద్ధికి పాటుపడిన తనను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ కోరారు. ప్రతి ముస్లిం కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్‌లో షాదీఖానా నిర్మాణానికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.2కోట్ల నిధులు కేటాయించామని, పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో మజీదులకు అవసరమైన చోట ప్రహరీల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ మాయమాటలకు మోసపోవద్దని, అన్ని విధాలుగా ఆదుకుంటున్న బీఆర్ఎస్ కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సయ్యద్ అక్బర్‌హుస్సేన్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ చైర్‌పర్సన్ రజనీతిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, కోఆప్షన్ సభ్యులు ఎండీ అయూబ్, ఇక్బాల్, ఇమా మ్, ఫారొద్దీన్, షర్ఫొద్దీన్, సర్వర్‌పాషా, నాయకులు ఇంతియాజ్, ఏడు మండలాల నుంచి వచ్చిన ముస్లింలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు


బీఆర్ఎస్ హుస్నాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులు

హుస్నాబాద్, నవంబర్ 23: హుస్నాబాద్ పట్టణంతోపాటు వివిధ మండలాలు, గ్రామాలనుంచి ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో భారీ సంఖ్యలో యువకులు, ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏబీవీపీ నాయకుడు కురుమెల్లి శివకుమార్‌తో పాటు మరో 50మంది కార్యకర్తలు, ఆరెపల్లి 9వ వార్డు నుంచి 30మంది వివిధ పార్టీల కార్యకర్తలు, పొట్లపల్లి గ్రామానికి చెందిన 30మంది కార్యకర్తలు, అక్కన్నపేట మండలం మోత్కులపల్లికి చెందిన గౌడ సంఘం అధ్యక్షుడు సహా 25మంది సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ హరీశ్, నమిలికొండ రాజయ్య, వికాస్‌యాదవ్, మిల్కూరి రవీందర్, గద్దల రమేశ్, మ్యాక నారాయణ, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

# చీమకైనా హాని చేయని వ్యక్తిని చంపాలనుకుండ్రు


చీకోడులో మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత, తదితరులు


కమ్మర్‌పల్లిలో బీఆర్ఎస్ ప్రచారానికి బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- **దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం**
- **బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత**
- **చీకోడు, కమ్మర్‌పల్లి గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్‌తో కలిసి విస్తృత ప్రచారం**

దుబ్బాక, నవంబర్ 23: బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని ఆయన సతీమణి మంజులత అన్నారు. గురువారం దుబ్బాక మండలం చీకోడు, కమ్మర్‌పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంజులత మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిపిన కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేసుకుందామన్నారు. అలిగినా గులిగినా ఓటు మాత్రం కారుకే వేయాలన్నారు. దుబ్బాకలో ప్రభాకర్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయనపై కత్తితో దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చీమకైనా హాని తలపెట్టని ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఈ సంఘటనపై మానవత్వం చూపించకుండా కోడికత్తి, మొండికత్తి అంటూ బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు అవహేళన చేయడం దారుణమన్నారు. రఘునందన్‌రావు మీడియాలో డబ్బా కొట్టుకోవడం తప్ప ప్రజల సమస్యలపై సోయి ఉండదని విమర్శించారు. మెదక్ ఎంపీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకను అభివృద్ధి చేసేందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని చెపాపరు. దుబ్బాక ప్రజలకు అందుబాటులో ఉంటూ పుట్టిన గడ్డకు సేవ చేసేందుకే ప్రజల మధ్యకు వస్తున్నారని, కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పని చేసే నాయకున్ని కాదని మాయమాటల వ్యక్తిని గెలిపిస్తే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఇందుకు గత ఉప ఎన్నికలే నిదర్శనమన్నారు. మూడేండ్లలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఒక్క రూపాయి పని చేసిండా ప్రజ లు ఆలోచించాలని కోరారు. మోసపోతే గోస పడుతామని, ప్రభాకర్‌రెడ్డిని గెలిపించి అసెంబ్లీకి పంపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రో జాశర్మ, ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు తౌడ శ్రీనివాస్, నర్సయ్య, ఎంపీటీసీలు రాంరెడ్డి, మాధవి, బీఆర్ఎస్ నాయకులు ఎల్లు రవీందర్‌రెడ్డి, ఇస్మాయిల్, భీమసేన, శ్రీనివాస్ పాల్గొన్నారు.


లకుడారంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

## కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం ఖాయం

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 23: ప్రతిపక్షాల డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమని, ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం పక్కా అని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. గురువారం కుకునూరుపల్లి మండలంలోని లకుడారం, ముద్దాపూర్, మంగోల్, చిన్నకిష్టపూర్, పీటీ వెంకటాపూర్, ఎల్లాయిగూడ గ్రామాల్లో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ చైర్మన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారని, ప్రజల ఉత్సాహం చూస్తుంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లక్షకు పైగా మెజార్టీ దాటేలా ఉన్నదన్నారు. కుకునూరుపల్లిని మండలంగా మార్చిన సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్వరాష్ట్రంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్ఆర్‌జీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కోలా సద్గుణారవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించాలి


సమావేశంలో పాల్గొన్న మైక్రో అబ్జర్వర్లు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 23: ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు మైక్రో అబ్జర్వర్లు ఏర్పాట్లను ముందస్తుగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల అబ్జర్వర్లు జయశ్రీ భోజ్, మన్మోహన్ ప్రసాద్, జిల్లా పోలీస్ అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ భూటియా సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో జిల్లాలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు నియమించిన మైక్రో అబ్జర్వర్లకు జిల్లా మాస్టర్ ట్రైనింగ్ ప్రధాన అధికారి అయోధ్య రెడ్డి బృందం సభ్యులు శిక్షణ ఇచ్చారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్, అదర్ ప్రిసైడింగ్ అధికారులతోపాటు మైక్రో అబ్జర్వర్లు కూడా పరిశీలించాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్, మైక్రో అబ్జర్వర్, నోడల్ ఆఫీసర్ సత్యజిత్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్ పాల్గొన్నారు.

## 26న దుబ్బాకకు సీఎం కేసీఆర్ రాక


దుబ్బాకలో ప్రజా ఆశీర్వాద సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక టౌన్, నవంబర్ 23: ఎన్నికల ప్రచార నిమిత్తం దుబ్బాకలో ఈ నెల 26న నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ వస్తున్నట్లు దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం సభా ప్రాంగణాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దుబ్బాకకు సీఎం కేసీఆర్ రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికేందుకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దుబ్బాకకు కావాల్సిన అభివృద్ధి వరాలు సీఎం నోట వెలువడే అవకాశం ఉన్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, కౌన్సిలర్ ఆస యాదగిరి, రాష్ట్ర నాయకుడు రొట్టె రాజమౌళి, నాయకులు తోట్ల మల్లేశం, చంద్రశేఖర్‌రెడ్డి, ఆస రాజశేఖర్ పాల్గొన్నారు.